సాక్షి వనపర్తి

శుక్రవారం । 28 । మార్చి । 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-53 (శనివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

భవిష్యత్ వ్యవసాయ రంగానిదే..



వనపర్తి రూరల్: రాబోవు కాలంలో వ్యవసాయ రంగం మిగిలిన రంగాలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దగూడెం శివారులో ఉన్న వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వసతులు, సమస్యలను అడిగి తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం మాట్లాడుతూ.. తాను వ్యవసాయ పక్షపాతినని, భవిష్యత్‌లో వ్యవసాయ రంగం మిగిలిన రంగాలకు మార్గదర్శనం అవుతుందని భావించి ఇక్కడ కళాశాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 20 ఎకరాల స్థలం కేటాయించి అన్ని వసతులతో అద్భుతమైన భవనం నిర్మించాలని కృషిచేసినా.. దురదృష్టవశాత్తు తమ ప్రభుత్వం రాకపోవడంతో అభివృద్ధి ఆగిపోయిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగంలో విశేష మార్పులు తీసుకురావడంతో రాష్ట్రం సుభిక్షంగా మారిందన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ప్రత్యేక దృష్టి సారించి కళాశాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, విజయ్‌కుమార్, ఉంగ్లం తిరుమల్, నాగన్నయాదవ్, నందిమళ్ల అశోక్ , హేమంత్, చిట్యాల రాము, భాగ్యరాజ్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన



అమరచింత: ఆంధ్రప్రదేశ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని గురువారం రాత్రి పట్టణంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. పురవీధుల మీదుగా బస్టాండ్ కూడలి వరకు కొవ్వొత్తులతో ఊరేగింపు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ హ్యాపీపాల్, కేవీపీఎస్ నాయకులు అజయ్, శ్యాంసుందర్ మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ పగడాలది ముమ్మాటికి హత్యేనని.. యాక్సిడెంట్‌గా నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,646



జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ. 6,646, కనిష్టంగా రూ. 5,222 ధరలు లభించాయి. అదే విధంగా కందులు గరిష్టంగా రూ. 6,001, కనిష్టంగా రూ. 5,000, మొక్కజొన్న గరిష్టంగా రూ. 2,281, కనిష్టంగా రూ. 1,827, జొన్నలు గరిష్టంగా రూ. 4,377, కనిష్టంగా రూ. 4,089, ఆముదాలు గరిష్టంగా రూ. 6,329, కనిష్టంగా రూ. 6,270, మినుములు రూ. 7,316, రాగులు గరిష్టంగా రూ. 3,077, కనిష్టంగా రూ. 2,207 ధరలు వచ్చాయి.

■ దేవరకద్ర మార్కెట్‌యార్డులో జరిగిన ఈ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2,039, కనిష్టంగా రూ. 1,909 ధరలు లభించాయి. ఆముదాలు గరిష్టంగా రూ. 6,011, కనిష్టంగా రూ. 6,000 ధరలు వచ్చాయి. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు దాదాపు 400 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

'జూరాల'కు మరమ్మతు..

రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు



ప్రియదర్శిని జూరాల జలాశయం ప్రధాన ఎడమ కాల్వ

- దెబ్బతిన్న జూరాల ఎడమ, రామన్‌పాడు కుడి కాల్వ గేట్లు.. లైనింగ్
- వేసవిలో పనులు చేపట్టేందుకు అధికారుల సన్నాహాలు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ, రామన్‌పాడు కుడి కాల్వ గేట్లు, అక్కడక్కడ దెబ్బతిన్న కాల్వ లైనింగ్, చిన్న చిన్న మరమ్మతులు వేసవిలో చేపట్టేందుకు అధికారులు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ప్రస్తుతం కాల్వల్లో సాగు, తాగునీరు వదులుతున్నామని పంట కోతలు పూర్తయిన వెంటనే అధికారుల ఆదేశాల మేరకు పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నామని అధికారులు వెల్లడిస్తున్నారు. వేసవి పూర్తయ్యే నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికతో ముందుకుసాగుతున్నామన్నారు. జూరాల ప్రధాన ఎడమ కాల్వ వెంట రంధ్రాలు పడటం, లైనింగ్ పెచ్చులూడుతోందని.. వేసవిలో మరమ్మతులు పూర్తిచేసి సకాలంలో సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. జలాశయం నుంచి ఆత్మకూర్ శివారు వరకు ఉన్న జూరాల ఎడమ కాల్వ వెంట ఎనిమిది చోట్ల కాల్వ దెబ్బతింది. వీపనగండ్ల వరకు ఉన్న ప్రధాన కాల్వ వెంట ఎన్ని గండ్లు ఉన్నాయో గుర్తించే పనుల్లో వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. రెండేళ్ల కిందట రూ.50 లక్షలతో డి–6 కాల్వ వెంట మరమ్మతులు చేసిన అధికారులు ప్రస్తుతం రూ.1.20 కోట్లతో గేట్లు, లైనింగ్ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.



నందిమళ్ల శివారులో దెబ్బతిన్న కాల్వ లైనింగ్

ఆయకట్టు ఇలా..

జూరాల ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు 1.20 లక్షల ఎకరాలుగా ఉండగా.. ప్రస్తుతం 85 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. అమరచింత మండలం నుంచి ఆత్మకూర్, మదనాపురం, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలం వరకు సుమారు 75 కిలోమీటర్ల పొడవున కాల్వ ఉంది. ఆయా మండలాలను కొన్ని విభాగాలుగా గుర్తించి వాటి ప్రకారం రైతులకు సాగునీరు అందిస్తున్నారు. చివరి ఆయకట్టు వీపనగండ్లలోని గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకు సాగునీరు ఎడమకాల్వ ద్వారానే విడుదల చేస్తున్నారు.

ఆరు కిలోమీటర్లు.. ఎనిమిది ప్రదేశాల్లో...

మూలమళ్ల నుంచి ఆత్మకూర్ శివారు వరకు ఎనిమిది ప్రదేశాల్లో కాల్వ దెబ్బతింది. వీటి మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే వర్షాకాలం వరదల నీటి ఉధృతికి లైనింగ్ దెబ్బతిని గండ్లుపడే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

రామన్‌పాడు గేట్లకు లీకేజీలు..

రామన్‌పాడు కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్న అధికారులు ఆయా గేట్లను పూర్తిస్థాయిలో మూసివేసినా లీకేజీలు ఏర్పడి ముందుకు పారుతోంది. అంతేగాకుండా ఎప్పుడో చేసిన కాల్వల లైనింగ్ దెబ్బతినడంతో ఎప్పుడు తెగిపోయాయోనన్న సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం రామన్‌పాడు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేస్తుంటారు. కాల్వల గేట్లు దెబ్బతినడంతో నీటి తాకిడికి ఎప్పుడు కొట్టుకుపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



రామన్‌పాడు కుడి కాల్వ

మరమ్మతులు చేపట్టాలి..



జూరాల ప్రధాన ఎడమ కాల్వకు ఏర్పడిన రంధ్రాలను పూడ్చడంతో పాటు దెబ్బతిన్న ప్రదేశాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. రెండేళ్లుగా కాల్వ పనులు, చేపట్టక పోగా.. కనీసం పూడికతీత, ముళ్లపొదలు కూడా తొలగించడం లేదు.

– వెంకటేష్, నందిమళ్ల

ప్రతిపాదనలు పంపించాం..



జూరాల ప్రధాన ఎడమ కాల్వ వెంట ఉన్న రంధ్రాలను పూడ్చడంతో పాటు చిన్న చిన్న మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గతేడాది ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. ఈ ఏడాది జూరాల ఎడమ కాల్వ, రామన్‌పాడు కుడికాల్వ గేట్ల మరమ్మతులు, చిన్న చిన్న పనుల కోసం రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైతే పంట కోతలు పూర్తవగానే పనులు ప్రారంభిస్తాం.

– జగన్మోహన్, ఈఈ, జూరాల ఎడమకాల్వ సబ్ డివిజన్

యాసంగి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు

వనపర్తి: యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఐకేపీ, పీఏసీఎస్, రైస్‌మిల్లుల యజమానులు, రవాణా సంస్థలతో ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని.. నీడ కోసం షెడ్, కూర్చోడానికి కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని, లేనిపక్షంలో కమీషన్ నిలిపివేస్తామని హెచ్చరించారు. ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించాలని, రైతులందరికీ మద్దతు ధర అందేలా చూడాలని, మిల్లులకు ధాన్యం తరలించే ప్రక్రియ వేగవంతం చేయాలని, రవాణా సంస్థలు సకాలంలో లారీలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఏ గ్రేడ్ వరికి రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300తో పాటు సన్నరకం ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. సన్న, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని.. కనీసం 500 మీటర్ల దూరం ఉండాలన్నారు. సన్నరకం ధాన్యం గుర్తింపునకు కేంద్రాల నిర్వాహకులకు వ్యవసాయ విస్తీర్ణాధికారుల ద్వారా శిక్షణ ఇప్పించాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరం మేరకు టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ కొలిచే, ధాన్యం తూర్పారబెట్టే యంత్రాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని.. ఆలోపు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కాశీవిశ్వనాథ్, పౌరసరఫరాలశాఖ డీఎం జగన్మోహన్, కో–ఆపరేటివ్ అధికారి ప్రసాద్‌రావు, మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి..

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి రోగులకు కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. ఫీడింగ్ కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో ప్రారంభించిన కంటి శస్త్ర చికిత్స విభాగంలో సేవలు మెరుగుపర్చాలని సూచించారు. ఎన్‌సీడీ క్లీనిక్, మైత్రి ట్రాన్స్ (ట్రాన్స్‌జెండర్) క్లీనిక్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటించాలన్నారు. సీటీ స్కాన్ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న గదిని పరిశీలించి టీజీఎస్‌ఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం డీఈకి పలు సూచనలు చేశారు. అనంతరం డయాలసిస్ విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న చికిత్స, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ భవనం, హాస్టల్ నిర్మాణ పనులను పరిశీలించారు. రెండు బోధన గదుల నిర్మాణాలు నెలరోజుల్లో పూర్తిచేసి అప్పగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం ఆగష్టులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంగారావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కిరణ్మయి, ఎన్‌సీడీ డా. రామచంద్ర, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

ప్రాజెక్టు భద్రతకే ఔట్‌పోస్టు ఏర్పాటు

- రూ.కోటితో ప్రతిపాదనలు
- ఎస్పీ రావుల గిరిధర్

అమరచింత: కృష్ణానదిపై నిర్మించిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రత దృష్ట్యా పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. గురువారం ప్రాజెక్టు వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్‌తో పాటు గెస్ట్‌హౌజ్ నిర్మాణానికి గురువారం పీజేపీ నందిమళ్ల డివిజన్ క్యాంపు ఏఈతో కలిసి ఎస్పీ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీటి నిర్మాణాలకు నాలుగు ఎకరాల స్థలంతో పాటు సుమారు రూ.కోటి అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని.. త్వరలోనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతరం పెద్దమందడి మండలంలోని పంటపొలాల్లో పట్టుకున్న భారీ మొసలిని జూరాల బ్యాక్‌వాటర్‌లో వదలడాన్ని ఆయన పరిశీలించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన..

మండల కేంద్రంలోని నాగులకుంటలో ఉన్న 13.08 ఎకరాల శిఖం భూమి కబ్జాకు గురికావడంతో గురువారం ఎస్పీ రావుల గిరిధర్ పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని సీఐని ఆదేశించారు. నాగులకుంటలో వర్షపునీరు నిలిచేలా ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్, ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు ఉన్నారు.



జూరాల వద్ద పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

రామన్‌పాడులో తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతుందని.. గురువారం 1,017 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదని చెప్పారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 24 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 71 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్ ఘనీ

పాన్‌గల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిపిల్లల సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగపడుతాయని.. విద్యార్థుల ఆలోచన విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు, దాతలు తోడ్పాటునందించాలని కోరారు. క్రాఫ్ట్ మేళాలో విద్యార్థులు తయారుచేసిన వస్తువులను ఆయన పరిశీలించారు.

విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం..

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ కోరారు. బడిపిల్లల సంబరాల కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు ఆర్థిక తోడ్పాటునందించిన దాత తిరుపతయ్యసాగర్‌ను విద్యాశాఖ తరఫున సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖ అధికారులు గణేష్‌కుమార్, చంద్రశేఖర్, ఎంఈఓలు శ్రీనివాసులు, నర్సింహ, మద్దిలేటి, శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రవికుమార్, రాము యాదవ్, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, జయరాములుసాగర్, వివిధ పాఠశాలల జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాన్‌గల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

రహదారి నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి వి.రజని

వనపర్తి రూరల్: వాహన చోదకులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని సూచించారు. గురువారం మండలంలోని చందాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. పిల్లలకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని తెలిపారు. బాల్యవివాహాలు, పోక్సో, మోటారు వెహికల్, బాలకార్మిక చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య, ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఖిల్లాఘనపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పేద కుటుంబాలకు చెందిన వారు ఉంటారని, వారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని.. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా మాత, శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారి డా. ఝాన్సీ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఖిల్లాఘనపురం, కమాలోద్దీన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణుల వివరాలు నమోదు చేసుకొని వారికి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డా. ప్రవీణ్, డా. సురేందర్, డా. చంద్రశేఖర్, డా. జ్యోతి, హర్షిత, ఎంపీహెచ్‌ఈఓ నర్సింహులు, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింహారావు, ఏఎన్‌ఎంలు, ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మానవుడి ఆయుష్షు పెంచడమే ఉగాది ఉద్దేశం



వక్త లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో గురువారం ఘనంగా ఉగాది వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో జీవిస్తున్న మానవుడి ఆయుష్షు పెంచడమే పండగ ఉద్దేశం అని, షడ్రుచులను వివిధ ప్రకృతి ప్రసాదాలతో తయారు చేసిన వాటిని ప్రసాదంగా స్వీకరించడం వల్ల ఆరోగ్యం పెరుగుతుందన్నారు. చేదు, తీపిలు జీవితంలో మంచి చెడులను ఆస్వాదించడమే అన్నారు. వక్త గుంత లక్ష్మణ్ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడమే ముఖ్యమని, సంస్కృతిలో భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తోందన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మర్చిపోవద్దని సూచించారు. ప్రపంచ విపత్తులకు భారతదేశ యువత మార్గాలను చూపాలని, చెడు వ్యసనాలకు బానిసై నిర్వీర్యం కాకుండా, తన కుటుంబంతో పాటు దేశసేవలో భాగం కావాలని, వసుధైక ఉమ్మడి కుటుంబ విలువను పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కవితలు, జానపద గేయాలు, జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ సంధ్యారాణి, ప్రిన్సిపాళ్లు రవికాంత్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు తపాలా సేవలు

లింగాల: మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తపాలా శాఖ సేవలను విస్తరిస్తున్నట్లు వనపర్తి డివిజన్ ఎస్‌పీఓ భూమన్న అన్నారు. మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీకి నూతనంగా మంజూరైన బ్రాంచి పోస్టాఫీసును గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాయవరంలో బ్రాంచి పోస్టాఫీసు ఏర్పాటు చేయాలని ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారన్నారు. ఈ బ్రాంచి పోస్టాఫీసు పరిధిలోకి కొత్తచెర్వుతండా, పాతరాయవరం, వడ్డెబక్కన గూడెం గ్రామాలు వస్తాయన్నారు. ఇప్పటి వరకు రాయవరంతోపాటు ఇతర గ్రామాల వారు అంబట్‌పల్లి పోస్టాఫీసుకు వెళ్తూ ఇబ్బందులకు గురయ్యేవారని, ఇక నుంచి ఆ ఇబ్బందులు తప్పినట్లేనని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టాఫీసు ద్వారా ఆసరా పింఛన్లు, ఉపాధి కూలీల డబ్బులు, ఇతరత్రా సేవలు ప్రజలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు సృజన్‌నాయక్, రవికుమార్, ప్రసాద్, రవికుమార్, బ్రాంచి పోస్టాఫీస్ ఇన్‌చార్జ్ బాలాజీనాయక్, నాయకులు మల్లయ్య, తిరుపతిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో బ్రాంచి పోస్టాఫీసును ప్రారంభిస్తున్న ఎస్‌పీఓ భూమన్న

బండ్ నిర్మాణానికి సహకరించాలి

గోపాల్‌పేట: మండలంలోని బుద్ధారం పెద్దచెరువును రిజర్వాయర్‌గా మార్చే పనుల్లో భాగంగా త్వరలోనే బండ్ నిర్మాణం చేపడతామని.. రైతులు సహకరించాలని ఇరిగేషన్ డీఈ గఫార్ కోరారు. గురువారం గ్రామంలోని రైతువేదికలో బండ్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న పొలాల రైతులతో సమావేశమయ్యారు. బండ్ నిర్మాణానికి 11 ఎకరాల భూమి అవసరమని.. ఇందుకోసం సర్వే కూడా పూర్తయిందని చెప్పారు. ప్రభుత్వం నష్ట పరిహారంగా ఎకరాకు రూ.9 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. సమావేశంలో రిజర్వాయర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌సుభాష్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శివలింగం, ఆర్‌ఐ యాదయ్య, సర్వేయర్ మైనుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


దాసు (ఫైల్)

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఎల్లికల్ రోడ్డులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాంచందర్ జీ, బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా దర్శికి చెందిన దాసు (43) పట్టణంలో నివాసముంటూ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మండలంలోని ఎల్లికల్‌లో మేస్త్రీ పని ముగించుకొని తన బైక్‌పై పట్టణానికి బయలుదేరాడు. పట్టణ సమీపంలోకి రాగానే కల్వకుర్తి వైపు నుంచి అతి వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ దాసును ఢీకొట్టింది. మరో బైక్ పై వెళ్తున్న పట్టణంలోని తిమ్మరాశిపల్లికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, అతడి భార్యను ఢీకొట్టింది. గాయపడిన వారందరిని చికిత్స నిమిత్తం పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. ఆస్పత్రిలో పరిస్థితి విషమించి దాసు మృతి చెందాడు. గాయపడిని శ్రీనివాస్‌రెడ్డి దంపతులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. దాసుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో గురువారం మధ్యాహ్నం ఇడగోటి శేఖర్ (42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. బల్మూరుకు చెందిన శేఖర్ 20 ఏళ్లుగా అత్తగారి ఊరైన కొరటికల్‌లో ఉంటూ వ్యవసాయంతో పాటు తాపీ మేస్త్రీగా చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య సునీత కూలీ పనులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్మ చేసుకున్నాడు. కాసేపటి తర్వాత ఇరుగుపొరుగు వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసే వరకు చనిపోయి ఉన్నాడు. శేఖర్‌కు భార్య సునీతతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త తాగిన మైకంలో ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజాపూర్ (బాలానగర్): బాలానగర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్ (57) టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి ఇంట్లో పడుకున్న చోటే మృతి చెందాడు. తన భర్త మృతిపై అనుమానం ఉందని భార్య జహంగీర్‌బీ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కల్వకుర్తి టౌన్: చోరీ చేసిన కేసులో ఇద్దరికి జైలుశిక్షతోపాటు.. జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని లింగసానిపల్లిలో రాములు ఇంట్లో గతేడాది దొంగలు పడి కొంత సొత్తును ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అక్కడ లభించిన ఆధారాలతో విచారణ ప్రారంభించారు. కేసులో భాగంగా నిందితులైన హైదరాబాద్‌లోని మెహిదీపట్నంకు చెందిన మాణిక్యం, బల్మూర్ మండలంలోని తుమ్మన్‌పేటకు చెందిన బాలరాజును పట్టుకొని విచారించి, సాక్ష్యాలను కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్య ఇద్దరు దొంగలకు నాలుగు నెలల జైలుశిక్షతోపాటుగా ఇద్దరికి చెరో రూ.వెయ్యి జరిమానా విధించినట్లుగా ఎస్ఐ తెలిపారు. కేసును విచారించి సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన కల్వకుర్తి సీఐ నాగార్జున, మాధవరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ బాలును ఎస్పీతోపాటు కల్వకుర్తి డీఎస్పీ అభినందించారు.

సామాజిక సేవలకు నెలవు


జిల్లా కేంద్రంలోని మసీదులో జుమా నమాజ్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు (ఫైల్)

- రంజాన్ మాసంలో దాతృత్వం చాటుతున్న ముస్లింలు
- పేదలకు దాన, ధర్మాలు
- దైవానుగ్రహం కోసం ప్రత్యేక నమాజ్‌లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష చేపట్టిన ముస్లింలు జకాత్, ఫిత్రా పేర్లతో దాతృత్వం చాటుతున్నారు. నిరుపేదలకు తినుబండారాలు, వస్త్రాల పంపిణీతో పాటు ఆర్థిక సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీక్షాపరులు చేస్తున్న ప్రత్యేక దాన, ధర్మాలు అందరిలో మానవీయ కోణాన్ని తట్టిలేపుతున్నాయి. దైవానుగ్రహం కోసం రాత్రి పొద్దుపొయ్యే వరకు చేస్తున్న తరావీ, తహజుద్ నమాజ్‌లు, ఖురాన్ పఠనం (ఇబాదత్)లతో ముస్లిం కుటుంబాల్లో దైవికం ఉట్టిపడుతోంది.

ఐదు పూటలా నమాజ్‌లు..

రోజు ఐదు పూటలా నమాజ్ చేసే ముస్లింలు రంజాన్‌లో తరావీ, తహజుద్, సల్వాతుత్తజ్బీ అనే ప్రత్యేక నమాజ్‌లు చేస్తున్నారు. తరావీ నమాజ్‌లో 20 రకాతులు ఉంటాయి. ఇషా నమాజ్ అనంతరం రాత్రి 9 గంటల నుంచి గంట లేక గంటన్నర పాటు ఈ నమాజ్ ఉంటుంది. తహజుద్ నమాజ్ రాత్రి 3 నుంచి 4గంటలలోపు నాలుగు లేక 8 రకాతులు చేస్తున్నారు.

సమభావం పెంచే ఇఫ్తార్లు..


ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

మసీదుల్లో సామూహికంగా ఇచ్చే ఇఫ్తార్ ముస్లిం సంప్రదాయానికి ప్రతీక. ఇఫ్తార్లకు ఇస్లాంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. సామూహిక ఇఫ్తార్లతో మనుషుల మధ్య అనుబంధాలు పెరుగుతాయని మహ్మద్ ప్రవక్త (స.అ.స) పవిత్ర హదీసుల్లో పేర్కొన్నారు. పేద, ధనిక తేడాలు తొలగిపోతాయి. హిందువులు ఇఫ్తార్ ఏర్పాటుచేసి ముస్లింలను ఆహ్వానిస్తున్నారు. ఇఫ్తార్ సోదర భావానికి ప్రతీకగా నిలుస్తోంది.

నేడు జుమాతుల్ విదా నమాజ్..

రంజాన్‌లోని చివరి శుక్రవారం చదివే నమాజ్‌ను జుమాతుల్ విదా అంటారు. నేడు జుమాతుల్ విదా పర్వదినం. ఈ జుమా నమాజ్‌ను వేలాది మంది ఒకేసారి మసీదు, ఆవరణలో చదువుతారు. పవిత్రమైన రంజాన్ మాసంలో తాము చేసిన ఉపవాసాలను అంగీకరించమని అల్లాను వేడుకుంటూ.. రంజాన్‌కు వీడ్కోలు పలికే ఈ నమాజ్ చాలా ప్రత్యేకతను సంతరించుకుంది. రంజాన్‌లోని మొదటి దశకం (పది రోజులు) క్షమాపణను ప్రసాదిస్తాయి. మూడో దశకం కఠిన శిక్షణ నుంచి విముక్తిని కలిగిస్తాయి.


భక్తిశ్రద్ధలతో షబే ఖదర్ వేడుకలు..

రంజాన్‌లో షబే ఖదర్ (పెద్దరాత్రి) చాలా విశిష్టమైనది. షబే ఖదర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ నెలలో 21, 23, 25, 27, 29 తేదీల్లోని రాత్రుల్లో అల్లా తన చివరి ప్రవక్త మహ్మద్ (స.అస) ద్వారా పంపిన సందేశాలు ఖురాన్ గ్రంథంగా అవతరించిందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ ఒక్క రాత్రి చేసే నమాజ్ వల్ల వెయ్యి నెలల రాత్రుల నమాజ్ చేసే పుణ్యం సొంతమవుతుందని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

ఆరుగురి కోసం అన్వేషణ


లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్తున్న సహాయక సిబ్బంది

- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- డీ1, డీ2 ప్రదేశాల్లో నాలుగు ఎస్కవేటర్ల ద్వారా మట్టి తవ్వకాలు


సొరంగం నుంచి బయటికి తెచ్చి వైర్లు సరిచేస్తున్న సిబ్బంది

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ సొరంగంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దుర్ఘటన జరిగి గడిచిన 34 రోజుల్లో రెస్క్యూ టీంలు ఇద్దరి మృతదేహాలను బయటికి తేగా.. మిగిలిన ఆరుగురి ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను గురువారం ఎస్ఎల్‌బీసీ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి, డిజాస్టర్ అండ్ మనేజ్‌మెంట్ ప్రత్యేకాధికారి అరవింద్‌కుమార్ పర్యవేక్షించారు. రెండురోజుల క్రితం లభించిన మనోజ్‌కుమార్ మృతదేహానికి కొద్దిదూరంలోనే మిగిలిన కార్మికులు ఉండే అవకాశం ఉందని భావించి.. ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపడుతున్నారు. డీ1, డీ2 ప్రదేశాల్లో నాలుగు ఎస్కవేటర్ల ద్వారా మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ మట్టిని కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి పంపిస్తున్నారు. తవ్వకాలకు అడ్డంకిగా మారిన టీబీఎం భాగాలను గ్యాస్ కట్టర్లతో తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేస్తున్నారు.

మరోసారి సొరంగంలోకి డాగ్స్

కేరళ నుంచి రప్పించిన కాడవర్స్ డాగ్స్‌ను సొరంగంలోకి మరోసారి గురువారం ఉదయం 11 గంటలకు పంపించారు. వాసన ద్వారా మానవ అవశేషాలను పసిగట్టే ప్రత్యేక లక్షణాలున్న ఈ డాగ్స్‌తో సంఘటన జరిగిన ప్రదేశంలో ఇది వరకే అయిదారు సార్లు పరిశీలించాయి. పలుచోట్ల అవి వాసన పసిగట్టగా.. ఈ మేరకు గురుప్రీత్‌సింగ్, మనోజ్‌కుమార్ మృతదేహాలు లభించాయి. అలాగే మిగిలిన ఆరుగురి కార్మికుల ఆచూకీ గుర్తించేందుకు ఆయా ప్రాంతాల్లో అన్వేషణ సాగిస్తున్నారు.

స్వస్థలానికి మనోజ్ మృతదేహం

సొరంగం కుప్పకూలిన ఘటనలో మృతిచెందిన మనోజ్‌కుమార్ మృతదేహం ఈ నెల 25న లభించిన విషయం తెలిసిందే. ఈ మేరకు మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లా బంగర్మావ్ గ్రామానికి ప్రత్యేక అంబులెన్స్‌లో పంపించగా గురువారం ఉదయం అక్కడికి చేరుకుంది. మనోజ్‌కుమార్ భార్య స్వర్ణలతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ అధికారులు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

సొరంగంలో చిక్కుకున్న వారిని బయటికి తీసుకొచ్చేందుకు ప్రమాద స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని ఎస్ఎల్‌బీసీ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. గురువారం జేపీ కంపెనీ కార్యాలయం వద్ద ఉన్నతాధికారులు, రెస్క్యూ బృందాలతో సమీక్ష నిర్వహించి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రత్యేక బృందాలు సొరంగం ప్రమాదం జరిగిన నాటి నుంచి నిరంతరంగా సమన్వయంతో సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని చెప్పారు. సొరంగంలో పేరుకుపోయిన మట్టి, టీబీఎం భాగాలు, ఊట నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ పనులు వేగవంతం చేస్తున్నారన్నారు. సొరంగంలో వెలువడిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నామని చెప్పారు. సిబ్బందికి అవసరమైన సదుపాయాలు, వసతులు కల్పిస్తూ నిరంతరంగా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఫిల్టర్ ఇసుక డంపులపై దాడులు


ఇసుక డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లె పునరావాస కేంద్రం సమీపంలో ఫిల్టర్ ఇసుక డంపులపై గురువారం రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను తహసీల్దార్ సలీముద్దీన్, ఎస్ఐ మల్లేశ్, ఆర్ఐ రాజు పరిశీలించారు. సుమారు 16 ట్రాక్టర్ల ఇసుక, 2 ట్రాక్టర్ల మట్టి, 4 చోట్ల ఇసుక తయారీ కేంద్రాలను గుర్తించారు. డంపుల వద్ద గ్రామ సేవకులను కాపలాగా ఉంచినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మట్టి, ఇసుక మాఫియా యథేచ్ఛగా కొనసాగుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని చిన్నోనిపల్లె గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

లైంగికదాడి ఘటనలో పోక్సో కేసు నమోదు

కల్వకుర్తి టౌన్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన అనిల్‌గౌడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అతడిపై పోక్సో కేసుతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఘటనపై బాలిక స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లుగా పోలీసులు తెలిపారు.

పరిశోధనలు ప్రామాణికంగా కొనసాగాలి


మాట్లాడుతున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పరిశోధనల్లో కచ్చితమైన ప్రామాణికత పాటించాలని పీయూ వీసీ శ్రీనివాస్ సూచించారు. గురువారం పీయూలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనపై జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రామాణికతతో పరిశోధనలకు పూర్తిస్థాయి పరిపక్వత వస్తుందని.. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, జావెద్, నాగసుధ, అరుంధతిరెడ్డి పాల్గొన్నారు.

టీజీపీఈసెట్ కార్యాలయం ప్రారంభం..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వచ్చే విద్యాసంవత్సరం వివిధ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష బాధ్యతను ప్రభుత్వం పాలమూరు యూనివర్సిటీకి అప్పగించింది. ఈ క్రమంలో ఇందుకు సంబంధించిన కార్యాలయాన్ని గురువారం పాలమూరు యూనివర్సిటీలో సెట్ కన్వీనర్ ప్రొ. దిలీప్‌కుమార్, వీసీ శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. పరీక్షను పకడ్బందీగా నిర్వహించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, ఏఆర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనకు పాటుపడాలి


మాట్లాడుతున్న పున్నారెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల హక్కుల సాధన కోసం యూనియన్ నాయకులు పనిచేయాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ (టీఎన్జీఓ) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో నిర్వహించిన యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలన్నారు. ప్రభుత్వం అమలుచేసే ప్రతి పథకాన్ని క్షేత్రస్థాయిలో చేరవేసే బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా విజయలక్ష్మి, కార్యదర్శిగా అంజలిరెడ్డి, ప్రధాన ఉపాధ్యక్షులుగా రాజేశ్వరిదేవి, నర్మద, ఉపాధ్యక్షులుగా శైలజ, సభ్యులుగా జయలక్ష్మి, లక్ష్మి, అంజలి, శ్రీదేవి, ఉమా, వరలక్ష్మి, సరోజ, నాగమణి, పుష్ప, సుజాత, శోభారాణి ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మాజీ అధ్యక్షురాలు సౌదామిని పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ అనుబంధమైన (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్) ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో గురువారం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూయూ రీజినల్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజిరెడ్డి మాట్లాడుతూ 2017 ఇవ్వాల్సిన పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ను ఈ ప్రభుత్వం వచ్చాక 21 శాతం ప్రకటించడం జరిగిందన్నారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించినట్లు తెలిపారు. మహాలక్ష్మి టికెట్ల వల్ల అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని యజమాన్యంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీలో నియామకాలు చేపట్టకుండా ఉద్యోగులపై పనిభారం పెంచిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా యూనియన్లను ప్రవేశపెట్టాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. సమావేశంలో రీజినల్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రీజినల్ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా డి.శ్రీనివాసులు, అధ్యక్షుడుగా ఎండీ రియాజ్ అహ్మద్, కార్యదర్శిగా ఎం.విజయబాబులను నియామకం చేశారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూయూ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు అబ్రహం, అదనపు ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములుయాదవ్, నాయకులు అహ్మద్‌ఖాన్, బాలయ్య, భాస్కర్, శ్రీలత, భాగ్య, నాగమణి, కుర్మయ్య, సుందర్, నరసింహ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మొసలి పట్టివేత


మొసలిని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని పెద్ద చెరువులో భారీ మొసలి పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. చెరువులోని చేపలను కాపాడుకునేందుకు స్థానిక మత్స్యకారులు గురువారం చెరువు వద్ద కాపలాకు వెళ్లారు. చెరువులో చేపల సైజ్‌ను పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా భారీ మొసలి కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని స్నేక్ సొసైటీ నిర్వాహకుడు చీర్ల కృష్ణసాగర్‌కు తెలియజేయడంతో ఆయన తన సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. ఒడ్డుకు చేరిన మొసలిని అతికష్టం మీద పట్టుకుని బంధించారు. అనంతరం ఖిల్లాఘనపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌కు సమాచారం అందించారు. డీఎఫ్ఓ ప్రసాద్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ నరేష్, ఎస్ఐ యుగంధర్‌రెడ్డి అక్కడికి చేరుకుని మొసలిని పరిశీలించారు. పట్టుబడిన మొసలి ఏడు ఫీట్ల పొడవు, 80 కిలోల బరువు ఉంటుందన్నారు. మొసలిని కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వదిలివేయనున్నట్టు వారు తెలిపారు.

నరహరిరాజుకు రంగస్థల సేవా పురస్కారం


వరకవుల నరహరిరాజుకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీహాల్‌లో జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత వరకవుల నరహరిరాజుకు రంగస్థల సేవా పురస్కారాన్ని అందజేశారు. దశాబ్దాలుగా నాటక రంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగానే ఈ పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు తడకమళ్ల రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్, ఆచార్య డీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో భూమి కాజేసేందుకు యత్నం

ఇద్దరికి రిమాండ్

గట్టు: తప్పుడు పత్రాలను సృష్టించి 4.12 ఎకరాల భూమిని కాజేసేందుకు యత్నించిన ఇద్దరిని గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మల్లేష్ వివరాల మేరకు.. మండలంలోని మిట్టదొడ్డి శివారులో బోయ బొంతల పెద్ద హనుమంతుకు 4.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 1992లో పెద్ద హనుమంతు చనిపోగా.. అతడి తమ్ముళ్లు బోయ బొంతల చిన్న హనుమంతు అలియాస్ గజ్జన్న, దుబ్బ రాముడు, బొంతల గోకారి సమానంగా పంచుకుని వ్యవసాయం చేసుకుంటున్నారు. అయితే బొంతల గోకారి కుమారుడు రామలింగయ్య తన పెద్దనాన్న పొలాన్ని అక్రమంగా దక్కించుకోవాలని పన్నాగం పన్నాడు. ఈ క్రమంలో 2018లో ధరణి పోర్టల్ రాగా.. రాయచూర్‌లో ఉన్న పెద్ద హనుమంతు తండ్రి నర్సయ్య ఆధార్ కార్డు తీసుకుని అందులో పేర్లను మార్చి, ఈ భూమిని రాయచూర్ పెద్ద హనుమంతు పేరున మార్చారు. 2021లో తుమ్మలపల్లికి చెందిన బైని ఆంజనేయులు, మిట్టదొడ్డికి చెందిన నర్సింహులు సహాయంతో 4:12 ఎకరాల భూమిని రాయచూర్ పెద్ద హనుమంతు పేరు నుంచి తన పేరున మార్చుకున్నారు. మోస పూరితంగా తప్పుడు పత్రాలతో భూమిని మార్చుకున్న వ్యవహారంపై బొంతల చిన్న హనుమంతు అలియాస్ గజ్జన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు బొంతల రామలింగయ్య, బైని ఆంజనేయులును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు ఆదేశించినట్లు పేర్కొన్నారు. మరో నిందితుడు మిట్టదొడ్డి నర్సింహులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్తపల్లి మర్రికి నిప్పు





మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఉన్న చారిత్రాత్మక మర్రిచెట్టు (గోసాయి మర్రి)కు నిప్పంటుకుంది. దీంతో మంటలు ఎగసి పడటంతో జనం బెంబేలెత్తిపోయారు. మండలంలో విలీన గ్రామాల్లో ఒకటైన కొత్తపల్లి మర్రి చెట్టుకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. దాదాపుగా 4 ఎకరాల్లో విస్తీర్ణంలో ఉన్న మర్రి చెట్టు చాలా ప్రసిద్ధి చెందింది. పాలమూరు పిల్లలమర్రి తరహాలో ఉన్న మర్రిచెట్టును ఎవరూ పట్టించుకోకపోవడంతో గుర్తింపునకు నోచుకోలేకపోయింది. కాగా, ఉగాది సందర్భంగా ఏటా మర్రిచెట్టు నీడలో ఉన్న ఆంజనేయస్వామికి శకటోత్సవం నిర్వహిస్తారు. ఇందుకోసం గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో చెత్తను కాల్చివేయగా.. మంటలు ఎగసిపడి మర్రి చెట్టు అంటుకుంది. భారీగా మంటలు రావడంతో ఆర్పడం గ్రామస్తులకు సాధ్యం కాలేక.. అధికారులకు సమాచారం అందించారు. కాగా పండగ ఉత్సవాలు జరుపుకొందామనుకుంటే ఈ ఘటన గ్రామస్తులను కలచివేసింది. – నవాబుపేట

IV

సాక్షి ఫ్యామిలీ

మహబూబ్‌నగర్

శుక్రవారం ॥ 28-3-2025

పేరెంటింగ్

ఐఏఎస్ అధికారిణి, ఇద్దరు పిల్లల తల్లి అయిన దివ్య మిట్టల్ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేసింది.
'నేను ఒక ఐఏఎస్ అధికారిణి ని.
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీలో,
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్) బెంగళూరులో చదివాను.
వీటిని సాధించడానికి చాలా కష్టపడ్డాను.
కానీ, నా ఇద్దరు చిన్నారి కూతుళ్లను పెంచే క్రమంలో
సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదీ నన్ను సిద్ధం చేయలేదు..'
అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొంది.
ఇటీవల కాలంలో ఉద్యోగం చేసే అమ్మల శాతం పెరుగుతోంది.
అదే సమయంలో పిల్లల పెంపకం పట్ల సరైన జాగ్రత్తలు
తీసుకుంటున్నామా అనే ఆందోళనా పెరుగుతోంది.
కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను
నేటి తల్లులు ఎలా సమతుల్యతను సాధించాలో నిపుణులు సూచిస్తున్నారు.



ఆఫీసులో అమ్మ... ఇంట్లో బిడ్డ

వయస్సుతో సంబంధం లేకుండా కష్టాల్లో ఉన్నప్పుడు మనం 'అమ్మా' అని పిలుస్తాం.

ఈ పిలుపు తల్లీ బిడ్డ జీవితాంతం పంచుకునే అనుబంధానికి స్పష్టమైన సూచన. ప్రాచీన కాలం నుండి సమాజంలో మహిళలు పిల్లల సంరక్షకులుగా పరిగణించబడ్డారు. వారి విధి ఇంటికి, ఇంట్లోని వారిని జాగ్రత్తగా చూసుకోవడానికి మాత్రమే పరిమితమయ్యింది. దీంతో తల్లులు ఎప్పుడూ ఇంట్లోనే ఉండాలనే ఈ భావన పిల్లలను వారి జీవితాల్లో, అభివృద్ధిలో సురక్షితంగా ఉంచింది. నేడు సమాజంలో తల్లులు ఇంటి పనుల నిర్వహణలోనూ, పిల్లల సంరక్షణలోనూ రెండు పాత్రలను పోషిస్తున్నారు. పిల్లల సంరక్షణలో తండ్రుల వాటా పెరిగినప్పటికీ మహిళలు ఇప్పటికీ వారి ఇంట్లో మొదటి సంరక్షకులుగా ఉంటున్నారు.

విజయవంతమైన మార్పు

ప్రపంచవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్ గురించి చేసిన అధ్యయనాల్లో దాదాపు 73 శాతం మంది మహిళలు 30 ఏళ్ల వయసులో తమ పిల్లలను చూసుకోవడానికి తమ ఉద్యోగాలను విడిచిపెట్టారని, 27 శాతం మంది కొంతకాలం తర్వాత తిరిగి వచ్చారని గమనించారు. వారిలో దాదాపు 16 శాతం మంది తమ వృత్తిపరమైన పని జీవితంలో అధికారులుగా ఉన్నారు. కాబట్టి తల్లులుగా ఉన్న మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా మార్చుకుంటున్నారని కూడా స్పష్టమైంది. 'ఉద్యోగినిగా డబ్బు సంపాదిస్తూ పిల్లలకు కావల్సినవి సమకూర్చ గలుగుతున్నాను. కానీ, వారిని సక్రమంగా పెంచ గలుగుతున్నానా..' అనుకునే తల్లులకు సాంకేతికత వరంగా మారింది. సమయానుకూలంగా వర్క్ ఫ్రమ్ హోమ్‌ను ఎంచుకోవచ్చు.

హద్దులు అవసరం

పని, కుటుంబంతో పాటు వ్యక్తిగత అవసరాలకూ ప్రాముఖ్యం ఇవ్వండి. శారీరక, భావోద్వేగ శ్రేయస్సు కోసం స్వీయ సంరక్షణ అవసరం అనేది గుర్తుంచుకోవాలి. రోజులో పిల్లలకోసమే అన్నట్టుగా కొంత సమయం గడపండి. ఆ సమయంలో ఏదైనా పని నైపుణ్యాలు నేర్పించాలా, చదువు పట్ల దృష్టి పెట్టాలా, ఆనందంగా ఉంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలా.. ఇలా దేనికది బేరీజు వేసుకోవాలి. సహాయకులుగా ఉండేవారి మద్దతు ఎలా అందుతుందో చెక్ చేసుకోండి. వృత్తిపరమైన వృద్ధికి, తల్లి పాత్రకు విలువనిచ్చేవారిని సహాయకులుగా ఉండేలా చూసుకోండి. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి. ప్రతి ఒక్కరూ పనులు చేసేలా, బాధ్యత తీసుకునే కుటుంబ వాతావరణాన్ని సృష్టించండి.

– ప్రొ. పి.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ నిపుణులు



సానుకూల ప్రభావాలు

- ఉద్యోగ తల్లిదండ్రులిద్దరూ ఇంట్లో రెండు పని చక్రాలతో తమ జీవితాలు సజావుగా నడుస్తున్నట్టు చూస్తారు. ఉన్నత విద్యను పొందగల సామర్థ్యం, భౌతిక, సౌకర్యవంతమైన జీవితాన్ని గడపగల సామర్థ్యం కారణంగా వారు మరింత సంతృప్తికరమైన జీవితాలను గడుపుతారు. ఇప్పుడు ఉద్యోగాల్లోకి వెళ్లే మహిళలు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, కెరీర్ అవకాశాలను సరైన ప్యాకేజీలతో అందుకుంటున్నారు.
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ అధ్యయనం ప్రకారం పనిచేసే తల్లుల కుమార్తెలు వారి తల్లులకంటే 23శాతం ఎక్కువ సంపాదిస్తారని తెలిసింది. మరోవైపు పనిచేసే తల్లుల కుమారులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఎదుగుతారు. వారి ఆఫీసుల్లో లింగ సమానత్వాన్ని ఇష్టపడతారు. మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లను గౌరవిస్తారు. వారు భవిష్యత్తులో తమ కుమార్తెలకు అద్భుతమైన తండ్రులుగా కూడా పెరుగుతారు.
- తమ తల్లి జీవితంలోని దుఃఖకరమైన రోజులనూ చూసి ఉంటారు. అంతేకాదు తమ తల్లి పట్టుదల, దృఢ సంకల్పం వారు మానసికంగా, ఆర్థికంగా తమ సామర్థ్యాల మేరకు తమను తాము ముందుకు తీసుకెళ్లేలా చేస్తాయి. అన్నింటికంటే వారు హీరోలలో తమ తల్లిని ఒక షీ-రో గా చూస్తారు.

మెరుగైన సమయ నిర్వహణ

- పనిచేసే తల్లులు ప్రతిరోజూ తమ పిల్లలతో కనీసం ఒకటి లేదా రెండు గంటలు గడపగలిగేలా సమయాన్ని ప్లాన్‌చేసుకోవాలి. ఇది ఒక దినచర్యగా అనుసరించాలి. వేర్వేరు పనులను షెడ్యూల్ చేయడం, వాటిని సమయానికి పూర్తి చేయడం అనే మీ అలవాటు మీ పిల్లలు అదే అడుగు జాడల్లో నడవడానికి ఒక ఉదాహరణగా ఉపయోగపడుతుంది.
- పిల్లలు టైమ్‌టేబుల్‌కు కట్టుబడి ఉండటానికి కూడా ప్రోత్సహిస్తుంది. పిల్లలు మీ పనిని పూర్తి చేయడంలో సహకరిస్తున్నందుకు మీకు సంతోషాన్ని కలిగిస్తుంది.
- కాలక్రమంలో పిల్లల సమయ నిర్వహణ నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇది వారి మెరుగైన జీవితానికి సహాయపడుతుంది. అంతేకాదు, పిల్లలతో మరింత నాణ్యమైన సమయాన్ని గడపడానికి సహాయపడుతుంది.



దివ్య మిట్టల్

అమ్మా, నువ్వే నా హీరో..

నా పెద్ద కూతురికి 8 ఏళ్లు. ప్రపంచం గురించి ఇప్పటికే భిన్నమైన ఆలోచనలను చేస్తుంటుంది. ఎదిగే క్రమంలో ఆమె ఆలోచనల కాంతిని మసకబారనివ్వం. కొన్నిసార్లు పని ఒత్తిడిలో చాలా అలసిపోయినట్టుగా ఉంటుంది. ఆ అలసటలో ఏడుపు వచ్చేస్తుంటుంది కూడా. అలాంటప్పుడు నా కూతురు నన్ను కౌగిలించుకుని, 'నువ్వు నా హీరోవి' అని చెబుతుంది. అంటే, పిల్లలు మనల్ని గమనిస్తారు. వారు మన వైఫల్యాల నుండి దృఢంగా ఎలా ఉండాలో నేర్చుకుంటారు. పడిపోవడం సహజమే అని ఆమెకు చూపించండి, ఆపై లేవండి. నా ఉద్యోగం నాకు ఇది నేర్పింది. ఏది జరిగినా నువ్వు స్థిరంగా ఉంటావని చూపించండి. మాతృత్వంలో తమకు తాము వేసుకునే ప్రశ్నల్లో కొంత అపరాధ భావనతో నిండి ఉంటాయి. నేను పిల్లలకు సరైనదే ఇస్తున్నానా, ఏమైనా తప్పులు చేస్తే.. ఇలాంటివి తలెత్తుతుంటాయి. కానీ, తెలుసుకోవాల్సింది ఏంటంటే మీరు మీ సొంత మార్గంలో ప్రయాణిస్తూ ఆమె దేనినైనా వెంబడించగల ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని గుర్తించాలి. తనను తాను క్షమించుకుంటూ ముందుకు సాగడం కూడా చాలా ముఖ్యం. మీకు ఒకరి కంటే పిల్లలు ఎక్కువమంది ఉంటే ఆ బాధ్యత పది రెట్లు పెరుగుతూనే ఉంటుంది. అందుకని, పిల్లలను ప్రేమించడం కంటే కూడా న్యాయంగా ఉండడటం ముఖ్యం.


– దివ్యా మిట్టల్

రోజువారీ జీవన విధానంలో ముఖ్యమైన వాటికి సమయం ఇస్తూ, తమ పనిని బ్యాలెన్స్ చేసుకుంటూ, చేస్తున్న పని గురించి పిల్లలకు క్లారిటీ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలను పొందుతారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

యుక్త వయసు

తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతుంటారు.
పిల్లలు చదువులతో కష్టపడాలి వాస్తవంగా.
కాని వారికి సోషల్ మీడియాలోని
చెత్తా చెదారం, తప్పుడు సమాచారం,
ఉద్రిక్త ఆకర్షణలు, హింసాత్మక భావజాలాలు...
ఇవి కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.
ఇటీవల వచ్చిన 'అడోలసెన్స్' వెబ్‌సిరీస్
మీద సర్వత్రా చర్చ జరుగుతున్నది.
ఇది హెచ్చరిక అంటున్నారు.
ఈ సిరీస్ మనల్ని ఎలా నిద్ర లేపుతున్నది?



డిజిటల్ లోయల్లో టీనేజ్ పిల్లలు

మీ పిల్లలు మీతో ఇంట్లో మాట్లాడే భాష మీకు తెలుసు. వాళ్లు సోషల్ మీడియాలో మాట్లాడే భాష మీకు తెలుసా? వాళ్లు ఉపయోగించే 'ఎమోజీ'ల అర్థాలు తెలుసా? మాటలు లేకుండా ఎమోజీలతో గాయపరిచే వీలు ఉంటుందని తెలుసా? కిడ్నీ బీన్స్, రెడ్ పిల్, బ్లూ పిల్, డైనమైట్, రెడ్ హార్ట్, పర్పుల్ హార్ట్, ఎల్లో హార్ట్.... ఈ ఎమోజీల అర్థం ప్రతి దానికీ మారుతుంది. అవి ఎందుకు ఉపయోగిస్తున్నారు. ఇంట్లో మన ఎదురుగా పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసు. సోషల్ మీడియాలో ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలుసా?

ముఖ్యంగా వారి వయసు 12– 14 సంవత్సరాల మధ్య ఉంటే వారికి తెలిసింది ఎంత... తెలియంది ఎంత... తెలిసీ తెలియంది అంత.

జాగ్రత్త సుమా... అని హెచ్చరించడానికి వచ్చింది 'అడోలసెన్స్' అనే వెబ్ సిరీస్.

నాలుగు ఎపిసోడ్స్‌ల సిరీస్

'అడోలసెన్స్' అనేది నాలుగు ఎపిసోడ్ల మినీ వెబ్ సిరీస్. బ్రిటిష్ క్రైమ్ డ్రామా. బ్రిటన్‌లో టీనేజ్ పిల్లల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తిని గమనించి ఈ సిరీస్‌ను తీశారు. జాక్ థోర్న్ స్క్రిప్ట్ రాస్తే, ఫిలిప్ బరాన్‌టిని దర్శకత్వం వహించాడు. ఒక్కో ఎపిసోడ్ ఒక గంట ఉంటుంది. విశేషం ఏమిటంటే ప్రతి ఎపిసోడ్ సింగిల్ షాట్. అంటే మధ్యలో కట్ లేకుండా కెమెరా కదులుతూ దృశ్యాలను చూపుతూ వెళుతుంది. ఈ మేకింగ్‌లో వినూత్నత వల్ల కూడా ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది.

ఎవరు నిందితులు?

సోషల్ మీడియాను, ఎమోజీలను కనిపెట్టిన వారా? వాటిని ఫోన్లకు అనుసంధానం చేసిన వారా? పిల్లలకు ఫోన్లు కొనిచ్చిన తల్లిదండ్రులా? వాళ్లు ఏ మీడియాను ఉపయోగిస్తున్నారో చూడని తల్లిదండ్రుల నిర్బాధ్యతా? వారితో గడపలేని బిజీతో ఉన్న తల్లిదండ్రుల నిర్లక్ష్యమా? సరిగా పెంచని, సరిగా విద్యాబుద్ధులు చెప్పని వారంతా ఇందుకు బాధ్యులు కాదా? సమాజంలో పేరుకున్న హింసా ప్రవృత్తిని దూరం చేయలేని పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, పౌర వ్యవస్థల్లో ఉన్న వీరంతా కాదా బాధ్యులు.

ఆ పసివాడి సంఘర్షణ

ఈ సిరీస్ మొదలు కావడమే 'జెమీ మిల్లర్' అనే 13 ఏళ్ల పిల్లవాడి అరెస్టుతో మొదలవుతుంది. ముందు రోజు రాత్రి స్కూల్లో తన క్లాస్‌మేట్ అమ్మాయి కేటీని కత్తితో ఏడుసార్లు పొడిచి చంపాడని అభియోగం. తండ్రి, తల్లి, సోదరి హడలిపోతాడు. జెమీ మిల్లర్ అయితే పోలీసులను చూసి ప్యాంట్ తడుపుకుంటాడు. ఆ తర్వాత జెమీనే కేటీని చంపాడని ఇందుకు ఒక స్నేహితుడు కూడా పురిగొల్పాడని విచారణలో ప్రేక్షకులకు అర్థమవుతూ ఉంటుంది. అయితే ఇందులో ఎవరి తప్పు ఎంత? దీనికి బాధ్యులు ఎవరెవరు? శిక్ష మాత్రం ఒక్కడికే పడబోతోందా?

ఇన్‌స్టా గొడవ

జెమీ వయసు 13 ఏళ్లే అయినా అతనికి ఇన్‌స్టా అకౌంట్ ఉంది. అందమైన ఫిమేల్‌మోడల్స్ బొమ్మలను అప్పుడప్పుడు షేర్ చేస్తుంటాడు. అతని పోస్టులకు కేటీ కామెంట్స్ పెడుతూ ఉంటుంది. వాటికి రకరకాల ఎమోజీలు వాడుతుంటుంది. అవి జెమీని బాధ పెట్టాయని మనకు తెలుస్తుంది. జెమీ తన వయసులో అపరిపక్వత వల్ల తను ఆకర్షణీయంగా లేడని తనను ఎవరూ ఇష్టపడరని న్యూనతతో ఉంటాడు. కేటీ కామెంట్స్ ఇందుకు ఆజ్యం పోస్తాయి. అంతే కాదు సాటి మనిషి పట్ల, ఆడపిల్లల పట్ల సెన్సిటివ్‌గా ఉండాలనే భావజాలం కాకుండా వాళ్లను ఏమైనా అనొచ్చు ఎలాగైనా ఉండొచ్చు అనే ఆధిపత్యపు భావజాలమే ఎక్కువగా జెమీకి పరిచయం అవుతుంటుంది. వీటన్నింటి దరిమిలా అతడు కేటీ ప్రాణం తీసేవరకూ వెళతాడు.

టీనేజ్ పిల్లలు ఎంతో సున్నితమైన దశలో ఉండే సీతాకోక చిలుకలు. వారిని గురించి అందరికీ బాధ్యత ఉండాలని చెబుతోంది ఈ సిరీస్. ఇందులోని ముఖ్య పాత్రను ఒవెన్ కూపర్ అనే బాల నటుడు అద్భుతంగా పోషించాడు. దిన పత్రికల వార్తలు కూడా మనకు రోజూ టీనేజ్ పిల్లల సమస్యలు, కుటుంబాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లోపం పట్టి ఇస్తున్నాయి. తల్లిదండ్రులు ఈ సిరీస్ చూడటం మంచిదంటున్నారు అభిరుచి ఉన్న ప్రేక్షకులు. కొందరైతే టీనేజ్ పిల్లలతో పాటుగా తల్లిదండ్రులూ చూడాలని సూచిస్తునారు. ముందు పెద్దలు చూడండి. ఆ తర్వాత మీకు సబబని అనిపిస్తే పిల్లలకు చూపించండి. కానీ ఆలోచించండి.

బ్యూటీ

నిర్లక్ష్యమే అసలైన సమస్య

అందంగా ఉండటం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందనేది అందరూ అంగీకరించాల్సిందే. యవ్వనంగా కనిపించాలనే తాపత్రయంతోనే జీవనం నాణ్యంగా గడపడానికీ ప్రయత్నించాలి. అందుకు బ్యూటీ చికిత్సలకు ఎక్కువ ఖర్చు పెట్టనవసరం లేదు. నేటి రోజుల్లో కాలుష్యం, సమతుల ఆహార లోపం, స్ట్రెస్ .. వీటన్నింటి ప్రభావం చర్మంపై పడుతుంది. అందుకని సమస్య ఎక్కడ ఉన్నదో దానిని పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

చాలా మంది ఎదుర్కొనేవి...

యవ్వనంలో ఉన్నవాళ్లైతే యాక్నె, మంగు మచ్చలు, కాస్మొటిక్స్ వాడకం వల్ల ఏర్పడే మచ్చల సమస్య ఉంటుంది. వీటికి ఇంట్లోనే సొంత చికిత్సలు తీసుకోవడం వల్ల మరికొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉదాహరణకు.. మొటిమలకు వెల్లుల్లి, టూత్‌పేస్ట్ వంటివి వాడుతుంటారు. మంగు మచ్చలకు తమకు తామే స్టెరాయిడ్స్ వాడుతుంటారు. ఇక శిరోజాల విషయంలో అయితే ఐరనింగ్, స్ట్రెయిటనింగ్, స్టయిలింగ్.. వంటి హెయిర్‌స్టైల్స్ ఎక్కువైపోయాయి. వీటివల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. జుట్టు ఊడిపోవడం పెరుగుతుంది.



బట్టల వల్ల అలెర్జీ

టైట్‌గా ఉండే బట్టలు వేసుకుంటుంటారు. ఫ్యాబ్రిక్ వల్ల దురద సమస్యలు వస్తుంటాయి. అవి, నిర్లక్ష్యం చేస్తే కుటుంబంలో మిగతా వారికీ ఆ ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. పులిపిర్లు ప్రైవేట్ పార్ట్స్‌లో వస్తుంటాయి. వాటినీ నిర్లక్ష్యం చేస్తుంటారు. కాస్మొటిక్ ప్రయోగాలు అయితే చెప్పలేం. అవి తమ చర్మానికి సరిపడతాయో లేదో కూడా చూడరు. దీని వల్ల చర్మం రంగు మారుతుంది.

ఫేషియల్స్

ఫెషియల్స్ చేయించుకుంటుంటారు. ఫ్రూట్ ఫేషియల్స్ సాధారణ కాంతికి పనిచేస్తాయి. హైడ్రా ఫేషియల్, డెర్మాఫేషియల్స్, కెమికల్ పీల్.. వంటి ఫేషియల్స్ నిపుణుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. హెయిర్‌కి, స్కిన్‌కి పీఆర్‌పీ చేయించుకుంటారు. ఇవి చేయించుకున్నంత మాత్రాన అంతా బాగయిపోదు. సరైన మెయింటెనెన్స్ అవసరం.

చెయిన్లతో మెడపై నలుపు

ఆడవాళ్లలో చాలా వరకు మెడపైన నల్లగా అవుతుంది. ఆర్టిఫిషియల్ జ్యువెలరీ, శుభ్రత పాటించకపోవడం, అధికబరువు వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అండర్ ఆర్మ్స్ డార్క్‌గా ఉన్నప్పుడు నిపుణుల సూచనలు తీసుకోవాలి. అధికబరువుకు లైపోసక్షన్ వంటివి చికిత్సలు తీసుకుంటారు. బరువు తగ్గినప్పుడు ఎలాంటి ఫిట్‌నెస్ సూచనలు పాటించాలో కూడా నిపుణుల సూచనలు తీసుకోవాలి.

స్ట్రెచ్ మార్క్స్

మహిళలకు ప్రసవం తర్వాత స్ట్రెచ్ మార్క్స్ పెద్ద సమస్య. ప్రసవం తర్వాత మూడవ నెల వరకు క్రీములు వాడుతూ ఉండాలి. అన్ని డెలివరీలు పూర్తయ్యాక స్ట్రెచ్ మార్క్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మరో సమస్య పాదాల పగుళ్లు. క్రీమ్ వాడితే దాని మీద దుమ్ము పేరుకుంటుంది. అందుకని, రాత్రి పడుకునేముందు పాదాలను శుభ్రం చేసి, క్రీమ్ రాసి, సాక్సులు ధరించాలి.

డిటర్జెంట్స్ వల్ల ఎగ్జిమా!

చేతులకు ఎగ్జిమా వస్తుంది. డిటర్జెంట్స్ వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. అందుకని ఇంటి క్లీనింగ్‌లో చేతులకు గ్లౌజ్స్ మోచేతుల వరకు ఉండేవి మార్కెట్లో లభిస్తున్నాయి. వాటిని ఉపయోగించాలి.

పర్మనెంట్స్ చేయించుకుంటున్నారా..!

బ్యూటీ చికిత్సలలో పర్మనెంట్ మెథడ్స్‌కి ఇటీవల డిమాండ్ పెరిగింది. వాటిలో బొటాక్స్, ఫిల్లర్స్, స్కిన్ బూస్టర్స్, లిప్ కరెక్షన్, స్కిన్ టైటెనింగ్, గ్లోయింగ్ కోసం తీసుకునే ఇంజక్షన్స్.. ఈ కాస్మొటిక్స్ చికిత్సలన్నీ వైద్యుల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. రెగ్యులర్ మేకప్ చేసుకునేవారు కాస్మొటిక్స్ తమ చర్మతత్వానికి సరిపడేవి ఎంచుకోవాలి. తిరిగి శుభ్రం చేసుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

– డా.స్వప్నప్రియ, డెర్మటాలజిస్ట్



పచ్చని తోరణాలు.. షడ్రుచుల ఆస్వాదన.. సంప్రదాయ వస్త్రధారణ
ఉగాదికి స్వాగతం పలుకుతూ
కొత్త ఉత్సాహాన్ని మదికి మోసుకువస్తాయి.
చేనేత చీరలు, ఎంబ్రాయిడరీ సొగసులు వాటి రంగుల హంగులు
ప్రకృతి పరవశించేలా పండగకు మరింత శోభను తీసుకువస్తాయి.
ముఖ్యంగా పసుపు, ఆరెంజ్, ఆకుపచ్చ, ఎరుపు రంగులు
పండగ కళను రెట్టింపుగా మన కళ్లకు కడతాయి.

ఫ్యాషన్

ప్రకృతి పరవశం



డిజైన్లు

చెక్స్, లైన్స్‌తో ఉన్న డిజైన్లు, మెరుపులు లేకుండా థ్రెడ్ ఎంబ్రాయిడరీ వర్క్, సహజంగా అనిపించే పెయింటింగ్స్ ఈ పండగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

చేనేత కళ

పండగ నాడు కళను రెట్టింపు చేసే అలంకరణకు ప్రాముఖ్యత ఇస్తుంటారు. అయితే, అందుకు పెద్ద హడావిడి లేకుండా మనవైన చేనేతలలో కాంతిమంతమైన రంగులున్న చీరలను ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో కంచిపట్టు చీరల నుంచి కలనేత వరకు అన్నీ పండగను వెలిగించేవే.

సహజమైన రంగులు

ప్రకృతి నేపథ్యంగా ఉగాది జరుపుకుంటారు కాబట్టి పసుపు, ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగుల కాటన్, తెలుపు, ఎరుపు కాంబినేషన్, పింక్ కలర్ టస్సర్, సిల్క్ చీరలు ప్రత్యేక ఆకర్షణతో ఆకట్టుకుంటాయి.

ఇతర అలంకరణలు..

- చీరలకు లాంగ్ స్లీవ్స్ బ్లౌజులు, టెంపుల్ జ్యువెలరీ లేదా థ్రెడ్, టెర్రకోట జ్యువెలరీ బాగుంటాయి.
- పసుపు, ఎరుపు కాంబినేషన్ ప్లెయిన్ గాజులు, సహజంగా అనిపించేలా తక్కువ మేకప్ ప్రత్యేకతను చూపుతుంది.
- శిరోజాల అలంకరణలో జడ, కొప్పులు, పువ్వులకు ప్రాధాన్యమిస్తే పండగ ప్రకృతి కళతో ఆకట్టుకుంటుంది.



